క్లుప్తంగా

స్వచ్ఛతపై విద్యార్థుల అవగాహన



పట్టణంలో విద్యార్థుల ర్యాలీ

సిద్దిపేటజోన్: మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు బుధవారం స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల గుండా సాగింది. ప్రజలు, వ్యాపారస్తులకు గులాబీలు అందించి వినూత్న రీతిలో అవగాహన కల్పించారు. క్లీన్ సిద్దిపేట, గ్రీన్ సిద్దిపేట అనే నినాదంతో ముందుకు సాగారు. తడి, పొడి, హానికర చెత్త విభజన గురించి వివరించారు. హైదరాబాద్ రోడ్డు మార్గంలో రోడ్లు ఊడ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఈఓగా సైదులు



జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ ఎంఈఓగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సైదులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎంఈఓగా ఇక్కడ విధులు నిర్వహించిన మాధవరెడ్డి పదవీవిరమణ పొందారు. ఈ సందర్భంగా ఎంఈఓ సైదులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక చర్యలు చేపడతానన్నారు. పీఆర్టీయూ, టీపీటీఎఫ్, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎంఈఓను సన్మానించారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, సత్తయ్య, శ్రీనివాస్, శంకర్, నాయక్, రాంచంద్రం, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని సందర్శించిన ఆస్కీ బృందం



వివరాలు సేకరిస్తున్న ఆస్కీ సభ్యులు

హుస్నాబాద్: ప్రభుత్వ ఆస్పత్రిలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు కోసం డాక్టర్ ప్రియదర్శిని నేతృత్వంలోని ఆస్కీ(అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా) సభ్యులు బుధవారం సందర్శించారు. ఆస్పత్రిలో సిబ్బంది, వైద్యులు, పరికరాలు, మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. 108 వాహనాన్ని పరిశీలించారు. ట్రామాకేర్ సెంటర్ కోసం తీసుకోవాల్సిన చర్యలను అధ్యయనం చేశారు. వారిని బీజేపీ నాయకులు కలిశారు. ట్రామాకేర్ సెంటర్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా రిపోర్టు అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఇంటింటి సర్వే



సర్వే నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు

వర్గల్(గజ్వేల్): ప్రజల స్థితిగతులు, ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొనేందుకు బాగ్‌లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బుధవారం వర్గల్‌లో ఇంటింటి సర్వే నిర్వహించారు. క్యాంపులో భాగంగా ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, పరిశుభ్రత, విద్య ప్రాధాన్యం, మహిళా సాధికారత లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలు ఉంటే శుక్రవారం ప్రత్యేక వైద్య నిపుణులతో నిర్వహించనున్న మెడికల్ క్యాంపునకు రావాలని సూచించారు. ప్రోగ్రాం అధికారి స్వప్న, పీడీ జంగం రాజు శిబిరాన్ని పర్యవేక్షించారు.

గ్లాట్ సభ్యత్వ నమోదు



సభ్యత్వం అందిస్తున్న గ్లాట్ ప్రతినిధులు

సిద్దిపేటఎడ్యుకేషన్/మిరుదొడ్డి(దుబ్బాక): గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ(గ్లాట్) జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల కళాశాలల్లో ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ జూనియర్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి సంఘం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. నూతనంగా నియామకమైన జూనియర్ లెక్చరర్లు సభ్యత్వం తీసుకోవాలని కోరారు. కో ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డిని సన్మానించారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వంశీ, ఉపాధ్యక్షుడు నవీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రకాశ్ పాల్గొన్నారు. అలాగే మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చంద్రశేఖర్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన శారదను సత్కరించారు.

మట్టి రోడ్లకు మహర్దశ ఎప్పుడో?

- వర్షాలతో అధ్వానంగా మారిన రోడ్లు
- పలు కాలనీల్లో ఏర్పడిన గోతులు
- సీసీ రోడ్లు వేయాలంటున్న స్థానికులు

జిల్లా కేంద్రంలోని పలు కాలనీలలోని మట్టి రోడ్లతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మట్టి రోడ్ల నుంచి మాకు ఎప్పుడు విముక్తి కలుగుతుందోనని ఎదురుచూస్తున్నారు. జిల్లా కేంద్రంలోనే ఈ దుస్థితి ఉంటే ఇక గ్రామాల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.



మైత్రీ వనానికి వెళ్లే ప్రధాన రహదారి



సంతోష్ నగర్ కాలనీలో..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట పట్టణంలోని సంతోష్‌నగర్, సందీప్ నగర్, కేసీఆర్‌నగర్, కుషాల్ నగర్, మహాశక్తినగర్, హౌసింగ్‌బోర్డ్ కాలనీ, మైత్రీ వనంతోపాటు పట్టణ శివారు కాలనీలలోను మట్టి రోడ్లేదర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దపెద్ద గోతులు పడి మరింత అధ్వానంగా మారాయి. దీంతో రాత్రివేళలో ఈ దారుల గుండా ప్రయాణించాలంటే కాలనీవాసులు జంకుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, వృద్ధులు తీవ్రమైన అసౌకర్యానికి గురవుతున్నారు. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే క్రమంలో జారిపడి గాయపడుతున్నారు.

హామీలు మాత్రమే..

మట్టి రోడ్లకు తోడుగా రోడ్లకు రెండువైపులా చెట్లు పెరగడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనాల వల్ల వెలువడే దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. త్వరలో మరమ్మతులు చేస్తామని హామీలు మాత్రమే ఇస్తున్నారని, పట్టించుకొనే పాపాన పోవడం లేదని కాలనీల వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి సీసీ రోడ్లు వేయాలని, మట్టి రోడ్లకు మోక్షం కల్పించాలని వాపోతున్నారు.

బయటకు వెళ్లాలంటేనే.. భయం



మట్టిరోడ్లపై బయటకు వెళ్లాలంటే భయంగా ఉంది. నెల రోజులు క్రితం కురిసిన వర్షాలతో రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ద్విచక్ర వాహనాలపై కూడా వెళ్లలేని పరిస్థితి. అధికారులు, స్థానిక నాయకులు స్పందించి సీసీ రోడ్లు వేయించాలి.

– పన్యాల రవీందర్‌రెడ్డి, సందీప్‌నగర్

సీసీ రోడ్లు వేయించాలి



మట్టిరోడ్లతో కాలనీవాసులంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్లపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటపుడు ప్రమాదాల బారిన పడుతున్నాం. జిల్లాస్థాయి, మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేదు.

– నందకుమార్, సంతోష్‌నగర్



డీఆర్‌సీసీ సెంటర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్

మెనూ పాటించకపోతే చర్యలు తప్పవు

అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్

హుస్నాబాద్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించకపోతే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్ హెచ్చరించారు. పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల(బెజ్జంకి), డీఆర్‌సీసీ, కంపోస్ట్ షెడ్లను బుధవారం పర్యవేక్షించారు. ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు పర్యవేక్షించారు. గురుకుల పాఠశాలలో కొన్ని బియ్యం బస్తాలల్లో నల్లటి పురుగులు వస్తున్నాయని పాఠశాల సిబ్బంది ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వంట గది, స్టోర్ రూం, మెనూ లిస్ట్‌ను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో నీరు నిలిచిపోవడంతో అక్కడ మొరం పోయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిసరాలు, వంటశాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, అసిస్టెంట్ ఇంజనీర్ పృథ్వీరాజ్ ఉన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ధనరాజ్

సిద్దిపేటరూరల్: గుండెపోటుకు గురయ్యే వారిని రక్షించేందుకు ప్రతిఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ధనరాజ్ సూచించారు. కలెక్టర్ కె.హైమావతి ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో పనిచేస్తున్న వివిధ శాఖల అధికారులకు బుధవారం సీపీఆర్‌పై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైన్‌విభాగం ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్‌లలో సీపీఆర్‌పై శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, సీపీఆర్ జిల్లా కోఆర్డినేటర్ డా.వినోద్‌బాబ్జి, డా.శ్రీకాంత్‌యాదవ్, వైద్య అధికారులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



అలిరాజ్‌పేటలో టీకాలు వేస్తున్న శ్వేత, సిబ్బంది

జగదేవ్‌పూర్(గజ్వేల్): గాలికుంటు నివారణ కోసం పశువులకు టీకాలు వేయించాలని పశువైద్యాధికారి శ్వేత సూచించారు. మండలంలోని అలిరాజ్‌పేటలో బుధవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు గాలికుంటు రాకుండా ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేస్తున్నామన్నారు. గ్రామంలో 120 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సిబ్బంది మౌనిక, హరి, మల్లికార్జున్, గోపాలమిత్ర యాదగిరి, స్వామి, గౌరయ్య, రైతులు పాల్గొన్నారు.

సకాలంలో వేయించాలి

మర్కూక్(గజ్వేల్): పశువులకు వ్యాధి నివారణ టీకాలను సకాలంలో వేయించాలని మండల పశువైద్యాధికారి శిరీష సూచించారు. మర్కూక్‌లో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించారు. గ్రామంలో 151 పశువులకు నివారణ టీకాలు వేయించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శంకర్‌రెడ్డి, సిబ్బంది ఆంజనేయులు, కిషన్, రవీందర్, కృష్ణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుడిదోమ నివారణకు సస్యరక్షణ

ఏఈఓ సబియా



అక్కన్నపేటలో వరి పంట పరిశీలిస్తున్న ఏఈఓ సబియా

అక్కన్నపేట(హుస్నాబాద్): అధిక వర్షాలు, వాతావరణంలో తేమ వల్ల వరి పంటలో సుడిదోమ ఆశించే అవకాశం ఉందని, సస్యరక్షణ చర్యలు పాటించాలని వ్యవసాయ విస్తరణాధికారి(ఏఈఓ) సబియా సూచించారు. మండల కేంద్రంలో పలువురి వరి పొలాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ పొలంలో సుడిదోమ తెగులు గమనిస్తే గాలి, ఎండ తగిలేలా పాయలు తీయాలన్నారు. అధికారుల సూచనల మేరకు మందు పిచికారీ చేయాలని చెప్పారు. కాటుక తెగులు గమనిస్తే ప్రోపికోనోజోల్ పిచికారీ చేయాలని సూచించారు. బ్యాక్టీరియల్ ఎండాకు తెగులు సోకిన పొలంలో యూరియా వేయడం ఆపేయాలని సూచించారు.

నిత్యజీవితంలో పోషకాహారం కీలకం

పోషణ అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ వెంకటప్రసాద్



గర్భిణులకు పోషకాహారం అందిస్తున్న అధికారులు

దుబ్బాక: మహిళలు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని పోషణ అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ ఆకుల వెంకటప్రసాద్ సూచించారు. ధర్మాజీపేటలో బుధవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా అందిస్తున్న ఒక్కపూట సంపూర్ణ భోజనం పథకాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలికల్లో రక్తహీనత లోపాన్ని నివారించడానికి ఆకుకూరలు, ఐరన్ ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో బ్లాక్ కో-ఆర్డినేటర్ శాంసన్, సూపర్‌వైజర్ స్వరూప, హెల్త్ సూపర్‌వైజర్ క్రిస్టియాన, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పోషణ సంబురం

పోషణమాసం సందర్భంగా బుధవారం పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ సంబురాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సీడీపీఓలు, సూపర్‌వైజర్లు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యమాలలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



వర్గల్(గజ్వేల్): చిన్నారులకు అన్నప్రాసన చేయిస్తున్న సీడీపీఓ సరిత తదితరులు



హుస్నాబాద్‌రూరల్: సీమంతాలు చేస్తున్న సీడీపీఓ జయప్రద



మిరుదొడ్డి(దుబ్బాక): ఖాజీపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో..

పద్మశాలీ సమాజం అభివృద్ధికి కృషి



పద్మశాలీ జిల్లా ఉద్యోగులు సంఘం నూతన కార్యవర్గం

ఉద్యోగుల సంఘం నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పద్మశాలీ సమాజం అభివృద్ధికి పద్మశాలీ ఉద్యోగులందరం కృషి చేయాలని వారి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడ్యాల రామ్మోహన్ పిలుపునిచ్చారు. జిల్లా పద్మశాలీ ఉద్యోగుల సంఘం ఎన్నికలు బుధవారం ఎన్నికల అధికారి సీహెచ్.నరసింహులు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా మామిడ్యాల రామ్మోహన్, అసోసియేట్ అధ్యక్షుడిగా చేబర్తి నర్సింహులు, ఉపాధ్యక్షులుగా వీరబత్తిని జమునారాణి, ఆర్.రాంభాస్కర్, పోగుల రాజు, లగిశెట్టి రాజు, ప్రధాన కార్యదర్శిగా దేవసాని వాసుదేవ్, సహాయ కార్యదర్శులుగా భాగ్యలక్ష్మి, శివరామకృష్ణ, పాము సందీప్, కోశాధికారిగా రచ్చ రమేశ్ తదితరులను ఎన్నుకున్నారు. రామ్మోహన్ మాట్లాడుతూ ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు సాగాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సిద్దిపేటరూరల్: ఉమ్మడి జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపిన చింతమడక విద్యార్థులు ఎనిమిది మంది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లుహెచ్ఎం కొత్త రాజిరెడ్డి బుధవారం తెలిపారు. అండర్–17 బాలికల విభాగంలో నికిత, డి.రుక్విత బంగారు పతకాలు; బి.అర్చన వెండి పతకం సాధించగా అండర్ 14– బాలికల విభాగంలో పి.గీతిక, ఆర్.శ్రీనిక వెండి పతకాలు సాధించారు. జి.శ్రీనిక కాంస్య పతకం సాధించింది. అండర్–14 బాలుర విభాగంలో యశ్వంత్ బంగారు పతకం, అండర్–17 బాలుర విభాగంలో రాము వెండి పతకం సాధించినట్లు తెలిపారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

వాలీబాల్ పోటీలకు..

తొగుట(దుబ్బాక): వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి శ్యాంసుందర్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం నయీమా తెలిపారు. గజ్వేల్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచినట్టు చెప్పారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య



గౌరయపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న జయదేవ్ ఆర్య

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాల, గౌరయపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీఓ శ్రీనివాస వర్మతో కలసి డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య బుధవారం సందర్శించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని నిర్వాహకులకు సూచించారు. కేంద్రాల వద్ద తాగునీరు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. అదే విధంగా ప్రతి రోజు ఎలక్ట్రానిక్ కాంటాలను సరి చూసుకుని ధాన్యాన్ని తూకం వేయాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాలలోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లతో మాట్లాడి ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ బాలలింగం, ఐకేపీ ఏపీఎం చంద్రం తదితరులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్ పీఎస్‌ను సందర్శించిన సీపీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): సీపీగా బాధ్యతలు చేపట్టిన విజయ్‌కుమార్ బుధవారం జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్ సందర్శించారు. కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. జిల్లా సరిహద్దు పోలీస్‌స్టేషన్ కాబట్టి సిబ్బంది శాంతి భద్రత విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రోడ్డు నిబంధనలు తప్పనిసరి: సీఐ

సిద్దిపేటకమాన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. మైనర్ డ్రైవింగ్, నంబర్ ప్లేట్ లేని వాహనాలపై బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టుబడిన వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, నంబర్ ప్లేట్ లేకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

◆ పాఠశాల, అంగన్‌వాడీకి భూమి వితరణ

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని కూరెళ్ల గ్రామానికి చెందిన అన్నాడి విమల తన భూమిని గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి గాను పంచాయతీకి వితరణ చేశారు. బుధవారం తహసీల్దార్ చంద్రశేఖర్ రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్‌ను కూరెళ్ల పంచాయతీ కార్యదర్శి బి.సతీశ్‌కు అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ విలువైన భూమిని గ్రామ అవసరాలకు దానం చేయడం గొప్ప విషయమన్నారు. ఎల్లయ్య, స్వామి, బుచ్చిరెడ్డి, మల్లయ్య , శ్రీశైలం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

◆ ట్రాక్టర్ పట్టివేత

హుస్నాబాద్‌రూరల్: మండల పరిధిలోని పందిల్ల వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. కేసు నమోదుచేసి డ్రైవర్ వానిష్‌ను అరెస్టు చేశామని చెప్పారు. అనుమతి లేకుండా ఇసుక, మట్టి రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

◆ నేడు పుస్తకావిష్కరణ

గజ్వేల్: సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం వేలూరు గ్రామంలో చోటుచేసుకున్న రైతు ఆత్మహత్యల నేపథ్యంలో ఉపాధ్యాయుడు, కవి, రచయిత పులి రాజు రచించిన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని గురువారం మల్లారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంబంధించిన కరపత్రాలను బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. మల్లికార్జున్, కనకయ్య, పి.ఎల్లారెడ్డి, డి.కృష్ణ, కిరణ్, అహ్మద్ ఉమర్, నర్సింహులు, కళాధర్, సాధిక్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

◆ డీసీసీ అధ్యక్ష పదవికి నామినేషన్

కోహెడరూరల్(హుస్నాబాద్): జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి కోసం తీగలకుంటపల్లి గ్రామానికి చెందిన బస్వరాజ్ శంకర్ బుధవారం హుస్నాబాద్‌లో ఏఐసీసీ పరిశీలకులు జ్యోతి రాథోడ్‌కు నామినేషన్ పత్రం అందించారు. శంకర్ ప్రస్తుతం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులుగా ఉన్నారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, జయరాజ్, మల్లారెడ్డి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

మద్దూరు(హుస్నాబాద్): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని దూల్మిట్ట ఎంపీఓ మాధవీజాదవ్ సూచించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో గ్లోబల్ హ్యాండ్ వాష్‌డేను పురస్కరించుకొని బుధవారం పిల్లలకు చేతులు శుభ్రం చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఆర్టీ చట్టంపై కార్యదర్శులకు అవగాహన కల్పించారు.

◆ రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు

చేర్యాల(సిద్దిపేట): విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై డిగ్రీ కళాశాలలో బుధవారం రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.ప్రణీత మాట్లాడుతూ ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.గంగయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

◆ దాచారం క్రాస్‌రోడ్డు వద్ద నాకాబందీ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారం క్రాసింగ్ వద్ద బుధవారం ఎస్ఐ సౌజన్య ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేసి ధ్రువపత్రాలు సరిగాలేని, హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ శాస్త్రవేత్తలుగా ఎదగాలి

హుస్నాబాద్/మిరుదొడ్డి(దుబ్బాక): దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన అబ్దుల్‌కలాంను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి ఆకాంక్షించారు. కస్తూర్బా గాంధీ విద్యాలయంలో సంకల్ప స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సుభాష్, మమత తదితరులు పాల్గొన్నారు. అలాగే అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కిషన్, టీచర్లు శ్రీనివాస్, బాలకృష్ణ, రాజేశ్వరి, వాలంటీర్లు సరిత, నవిత తదితరులు అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

◆ ప్రత్యేక తరగతులతో మంచి ఫలితాలు

దౌల్తాబాద్(దుబ్బాక): ప్రత్యేక శిక్షణ తరగతులతో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓ గజ్జల కనకరాజు అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ప్రణాళికతో చదివితేనే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని చెప్పారు. సంజీవ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రాజు, చంద్రమౌళి పాల్గొన్నారు.

◆ విద్యార్థుల తల్లులకు టైలరింగ్ శిక్షణ

దుబ్బాకరూరల్: మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల తల్లులకు ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభుదాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫౌండేషన్ ద్వారా శిక్షణ పొందిన వారు స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. అదే విధంగా వాసన్ ఐకేర్ సహకారంతో నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రతినిధి కలవేణి శ్రీనివాస్, హెచ్ఎం పెంటయ్య, సునీత, వెన్నెల, రాజు, నిహారిక, లత తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థి దశ చాలా కీలకం: సీఐ శ్రీను

కొమురవెల్లి(సిద్దిపేట): విద్యార్థి దశ ఎంతో కీలకమని చేర్యాల సీఐ శ్రీను అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలు, సైబర్ మోసాలు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, ఈవ్ టీజింగ్‌పై షీ టీంతో కలసి బుధవారం అవగాహన కల్పించారు. నీరజ, షీ టీం సభ్యులు సైదయ్య, స్వప్న, ప్రశాంతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.